# ఓ ప్రేమ కథ

— ముని సతీష్



"నాక్కొన్ని తెల్ల కాగితాలూ, పెన్నూ కావాలి. కొద్దిగా రాసుకోవాలి" సెంట్రీ దృష్టిని ఆకర్షించడానికి చిన్నగా దగ్గి, నా వైపు చూడగానే అడిగాను.

"ఎందుకురా" అని ఆయన గద్దించలేదు. నేను కాలేజీ చదువు పూర్తికాకముందే నరాసరి నేరుగా జైలుకి వచ్చాను. కాలేజీ యూనియన్ ఛైర్మన్ని. నాలాంటివారిని పోలీసులు ఊరికే కొట్టరు. విద్యార్థులు సమ్మెలు చేస్తారని భయం.

తెచ్చిచ్చాడు.

కథ రాయాలనుకున్నాను. కథ ఎలా రాయాలో, ఎంత రాయాలో నాకు తెలియదు. కానీ ఆంధ్రజ్యోతిలో లవ్‌స్టోరీలు వేస్తారని తెలుసు. కొన్ని చదివాను కానీ నాకు కథా రచన తెలీదు. నిజాన్ని నిజంలాగే వ్రాస్తే వేస్తారో ఏమో నాకు తెలియదు. అయినా ఏదో రాయాలి అని మనసులో ఉంది.

— ప్రారంభించాను.

* * *

"డిసెంబరు సన్నని చలిలో, ఉదయం కాలేజీ హాయిగానే ఉంటుంది.

నేనూ, హేమలతా ఇద్దరం కలిసే పోతున్నాం—కాలేజ్ కారిడార్లో. హేమలత అంటే నాకు మంచి స్నేహితురాలు, ఇంకా మంచి ప్రేమికురాలు, అంతకు మించి నాకు కాబోయే భార్య. మేమిద్దరం చాలా గాఢంగా ప్రేమించుకున్నాం. ఇరువైపులా పెద్దల అంగీకారంతో ఈ యేడు డిగ్రీ పూర్తికాగానే పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాం.

ఏదో సబ్జెక్టు గురించి మాట్లాడుకుంటూ నడుస్తున్నాం. యూనివర్సిటీ క్రికెట్ జట్టు సెలక్షన్స్‌కి వెళ్ళడానికి ప్రిన్సిపాల్ పర్మిషన్ లెటర్ కోసం ఆయన గదివైపుగా వెళుతూ మలుపు తిరిగాం.

"వెళ్తున్నార్రా! మేడ్ ఫర్ ఈచ్ అదర్ జంట" అరిచాడు ఒకడు.

నేను ఛైర్మన్‌గా పోటీ చేసినప్పుడు ఓడిపోయిన వర్గం తాలూకు మనిషి వాడు. నాపై గెలవలేకపోయిన కసిని మరో విధంగా తీర్చుకుంటున్నాడు. వెనక్కి తిరిగి చూశాను. లాన్‌లో ఏదో బాటనీ మొక్కల కోసం వెదుక్కుంటున్నట్టు నటించారు.

"ఆ పిల్ల స్ట్రక్చరేరా నాయనా! ముందూ-వెనకా ఊపిరి తిప్పుకోనివ్వడం లేదురా బాబూ" అంటూ సినిమా ఆక్టర్‌ను అనుకరించినట్టుగా తలపై చేతులుంచుకుని అభినయిస్తూ అన్నాడు మరొకడు.




వాళ్ళవైపు వెళ్ళబోయాను. అంతలో హేమ నా చెయ్యి పట్టుకుని వడివడిగా లాక్కెళ్ళింది, వాళ్ళతో గొడవ వద్దని.

"పెళ్ళి కాకముందే మొగుణ్ణి చుడీదార్‌కు కట్టేసుకుందిరో" మరొకడు అరిచాడు గట్టిగా, అందరూ నవ్వుతున్నారు. మాకు విన్పించేటట్టు. టీజింగ్ మాకు మామూలైపోయింది. కానీ కసి కూడా పెరిగిపోతోంది. రోజు రోజుకీ వాళ్ళ కామెంట్స్ మితిమీరుతున్నాయి. డెడ్‌లైన్ సమీపించింది- అనుకున్నాన్నేను.

ఆ రోజు-మేడమీది వరండాలో నడచి వెళ్తున్నాను. వరండా గోడ మీద కూర్చొని వాడు కామెంట్ చేశాడు. "ఈ అనంత్‌గాడి లవర్ని మనమందరం కలసి కనీసం ఒక్కసారి 'గ్రూప్ రేప్' చేస్తేగానీ నాకు తృప్తి ఉండదురా!" అని.

ఆ ముక్క పూర్తయ్యేసరికి నడుస్తున్న నేను సరిగ్గా వాడి ముందున్నాను. "యూ బాస్టర్డ్" అని మనసులో తిట్టుకుంటూ వాడి వైపుకు తిరిగి బలంగా వాడి ముఖం మీద చరిచాను. నేనూహించలేదు. తేలిగ్గా కూర్చొని ఉన్నాడేమో వాడు మేడ మీదనుంచి కిందపడిపోయాడు. తల్లక్రిందులుగా, గోడమీదినించి జారుతూ వాడు అరచిన అరుపు పూర్తి కాకుండానే తల పగిలి చచ్చిపోయాడు. గంటలోగా నేను హత్యా నేరం క్రింద అరెస్టయ్యాను. మా కాలేజి ఎలక్షన్స్‌లో వాడిని సపోర్ట్ చేసిన మాజీ ఎమ్మెల్యే నాకు బెయిల్ దొరక్కుండా చేశాడు.

కోర్టు నన్ను రిమాండ్‌కు పంపింది.

ఒక్క విషయం మాత్రం నిజం-నేను విడుదలయ్యేలోగా హేమలతకు ఏమైనా జరిగిందంటే మాత్రం నేను ఎవ్వర్నీ ప్రాణాల్తో ఉంచను.

* * *

— అంతా రాసి ఒకసారి చదువుకున్నాను.

నవ్వొచ్చింది. కథ ఇలాగే ఉంటుందా అనిపించింది. ఏదయితే అయింది లెమ్మని అడ్రస్ రాశాను- ముంతల అనంతకుమార్, ఖైదీ, సబ్ జైలు, తిరుపతి.

"జైలర్ సార్‌కి చూపించి పోస్ట్ చేయించు" సెంట్రీని పిలిచి చేతికిస్తూ చెప్పాను.

"ఏందిది?" అడిగాడు.

"కథ"

"ఎక్కడికి"

"జ్యోతికి"

"నీ బతుక్కి జ్యోతి కూడానా"

"నా బతుక్కి కాదు, నా కథకు జ్యోతి" కాస్త కోపంగా అన్నాను.

గంట గడిచింది. జైలర్ కనకరత్నాచారి వచ్చాడు. "బాగా రాశావు" అన్నాడు. "నేను రచయితను కాదు" చెప్పాను. "తప్పక పడుతుంది" అన్నాడు కాస్సేపాగి. నేను మౌనంగా ఉండటం చూసి "పడితే తెచ్చి చూపిస్తాను" అని వెళ్ళిపోయాడు.

ఊచలు లెక్క పెడుతూ ఆలోచిస్తున్నాను. ఇప్పటికి చాలాసార్లు లెక్క పెట్టాను పదహారే ఉన్నాయి స్థిరంగా.

నా నిర్ణయం కూడా స్థిరమైనదే, హేమూకేమైనా అయిందంటే మాత్రం ఒక్కడినీ ప్రాణాల్తో మిగలనివ్వను.